చెరువులో నీళ్లు.. పొలాలు బీళ్లు

- ఆరేళ్లుగా నిరుపయోగంగా పెద్ద చెరువు
- రూ.2కోట్లు వెచ్చించినా ఆయకట్టుకు చేరని సాగునీరు
- ప్రణాళిక లేకుండా కాలువలు నిర్మించడమే ప్రధాన కారణం


కాజిపల్లిలోని పెద్దచెరువు

భీమారం: ఏడేళ్ల క్రితం మండలంలోని కాజిపల్లిలో పెద్దచెరువు నిర్మించడంతో ఎంతో సంబురపడ్డ రైతులు కాలువల పరిస్థితి చూసి అంతలోనే భంగపడ్డారు. నీటివనరులు అధికంగా ఉన్న మండలంలో కాజిపల్లి పెద్దవాగుపై చెరువు నిర్మిస్తే దాదాపు 1500ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుందని ప్రజలు చేసిన విన్నపాలకు, ప్రభుత్వం సరేనని చెప్పి పదేళ్ల క్రితం సర్వే నిర్వహించగా చెరువు నిర్మాణం కోసం కాజిపల్లి వాగు అనుకూలంగా ఉందని ఇంజనీర్లు ప్రభుతా నివేదిక ఇచ్చారు. దీంతో ప్రభుత్వం చెరువు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు నిర్మాణ పనులకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా, అందులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు సక్రమంగా చేయకుండా సంవత్సరాల కొద్ది కాలం గడిపారు. చివరకు 2017లో పూర్తి చేశాడు. కానీ కాలువల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా అసంపూర్తిగా వదిలివేయడంతో, ఇప్పుడు చెరువులోని నీళ్ల ఎందుకు పనికి రాకుండా మారాయి.

చెరువు కన్నా కాలువలు ఎత్తు..



ఎక్కడైన చెరువు ఎత్తు ప్రాంతంలో నిర్మించి కాలువల ద్వారా పొలాలకు నీరందిస్తుంటారు. కాజిపల్లిలో మాత్రం చెరువు కన్నా కాలువలు ఎత్తుగా ఉండటంతో రైతులకు ఇబ్బందిగా మారింది. చెరువుకు రెండు తూములు ఏర్పాటు చేశారు. కానీ అవి చెరువు కన్నా ఎత్తుగా ఉండటంతో సాగు నీరు పారకపోవడంతో రైతులు వినియోగించుకోలేక పోతున్నారు. కాజిపల్లి, దాంపూర్, నర్సింగాపూర్ గ్రామాల్లోని వ్యవసాయ భూములకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన చె రువుకు, ఆయకట్టులో కనీసం 70ఎకరాలకు కూ డా సాగునీరు అందడంలేదు. ప్రభుత్వం తిరిగి కాలువల నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ముందుచూపు మంచిదే కానీ..

భీమారం సమీపంలో గొల్లవాగు ప్రాజెక్ట్ నిర్మించిన ప్రభుత్వం దీనిద్వారా మండల రైతులకు ఎక్కువ మేలు చేయదని చెన్నూర్ మండలంలోని దాదాపు 18గ్రామాలకు సాగు నీరందిస్తుందని ఈ నేపథ్యంలో అధికారులు భీమారం మండలం కాజిపల్లి సమీపంలో పెద్ద చెరువు నిర్మిస్తే కాజిపల్లి, దాంపూర్, నర్సింగాపూర్ గ్రామాల రైతుల భూములకు రెండు పంటలకు సరిపోను నీరు అందించవచ్చని పెద్దవాగు చెరువుకు శ్రీకారం చుట్టారు. అధికారులు భావించినట్లు చెరువు నిర్మించారు. కానీ దాదాపు 1500ఎకరాలకు సాగు నీరందించేందుకు కాలవల నిర్మాణం చేపట్టలేదు. కాలువల నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.

ఈజీఎస్ ద్వారా చేపట్టాలి

కాజిపల్లి వద్ద గల పెద్ద చెరువుకు కాలువ నిర్మాణం ఈజీఎస్ ద్వారా చేపట్టాల్సిన అవకాశం ఉంది. ఇరిగేషన్ శాఖ ద్వారా మాత్రం కాలువల నిర్మాణ కోసం పనులు చేపట్టలేం. ఉపాధి నిధుల ద్వారా కాలువలను లోతుగా తవ్వించుకోవాలి.

– శారద, ఇరిగేషన్‌శాఖ డీఈ

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- ప్రభుత్వ విప్ బాల్కసుమన్


చెరువులో చేపపిల్లలు వదులుతున్న విప్ సుమన్

రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి ఊరచెరువులో గురువారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లల పెంపకంతో మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజల అండదండలు ఉండాలన్నారు. కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ సుమన్‌కు సన్మానం

కోటపల్లి: పార్‌పల్లి నూతన మండలం ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్‌కు పార్‌పల్లి మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గుర్రం రాజన్న, పాలపుల్ల చంద్రు, రామకృష్ణ, బాపు, రాజేశ్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నాం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు


రాపల్లిలో గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్/నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్రీడల్లో రాణించేవారికి తగిన ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని మొత్తం 10క్రీడాప్రాంగణాలకు అవసరమైన వాలీబాల్, క్రికెట్ స్పోర్ట్స్ కిట్లను గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నస్పూర్ మున్సిపాలిటీలో పరిధిలోని 11వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. హాజీపూర్ మండలం రాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.28లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. రూ.10లక్షల ఎమ్మెల్యే నిధులతో నిర్మించే డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మంచిర్యాలలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మేనేజర్ కె.విజయ్‌కుమార్, కౌన్సిలర్లు మాదంశెట్టి సత్యనారాయణ, పోరెడ్డి రాజు, సుదమల్ల హరికృష్ణ, నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, హాజీపూర్‌లో సర్పంచ్ ఆనె మల్లేశ్, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ చేశారు. మండలంలోని లింగాపూర్‌లో రూ.20లక్షల నిధులతో నిర్మించే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి, బుచ్చయ్యపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంకుశం గ్రామంలో రూ.18లక్షల నిధులతో మహిళా సమైక్య భవన నిర్మాణం, రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కన్నాల గ్రామంలో రూ.10లక్షల నిధులతో నూతన సీసీ రోడ్లు, పాతబెల్లంపల్లి గ్రామంలో మురికి నీటి కాలువ, సీసీ రోడ్డు, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూ.25లక్షల నిధులతో మండల మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండల పరిధిలోని మహిళా సంఘాలకు మంజూరైన రూ.5కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలను మహిళలకు, యువకులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, చంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ స్వామి, సర్పంచ్‌లు వెంకటేశం, మాధవి, రాయలింగు, స్వరూప, రాజమొగిళి, ఎంపీటీసీ సుభాష్‌రావు, డీపీఎం స్వర్ణలత, ఏపీఎం శ్యామల, మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మా గ్రామానికి కేటాయించిన నిధులెన్ని'

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాతబెల్లంపల్లిలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ, ఇతర అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిన్నయ్య హాజరు కాగా, మా గ్రామానికి కేటాయించిన డీఎంఎఫ్‌టీ నిధులు ఎన్ని, అవి ఏమయ్యాయని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల కాలంలో గ్రామానికి వచ్చిన నిధుల గురించి వివరించాలని చిన్నయ్యను అడిగారు. మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడే క్రమంలో అక్కడే ఉన్న తాళ్లగురిజాల ఎస్సై నరేష్, ఏఎస్సై లింగన్న సముదాయించారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ విప్ నల్లాల ఓదెలు


మిట్టపల్లిలో పథకాలు వివరిస్తున్న ఓదెలు

జైపూర్: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని, చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు తెలిపారు. జైపూర్ మండలం మిట్టపల్లి, కుందారం, పొనూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటికీ ప్రచారం నిర్వహిచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు, మహిళలలు కాంగ్రెస్‌లో చేరగా కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఇందిరమ్మ రాజ్యంలోని ప్రతి ఇంటింటికీ అందేలా కాంగ్రెస్ పార్టీ సంకల్పించిందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు తెలియజేశారు. హాజీపూర్ మండలం నర్సిగాపూర్‌లో గురువారం పథకాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబారి కుటుంబరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సవరణపై సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై వచ్చిన మార్పులు, చేర్పులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో 287 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో వచ్చిన మార్పులు, చేర్పులు, జెండర్ రేషియో వివిధ రాజకీయ పార్టీ నాయకులకు వివరించినట్లు తెలిపారు. తుది ప్రచురణకు 13 వేల ఓటర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో జోత్స్న, మంచిర్యాల తహసీల్దార్ భోజన్న, ఎన్నికల అధికారి సనత్, శ్రీహరి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

పాతమంచిర్యాల: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి పేదలకు వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో వైద్యం అందక ఇప్పటికే 8మంది చనిపోయారని, వాతావరణ మార్పుల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, మండల ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు లేక ప్రజలకు వైద్యం అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు ప్రజలకు వైద్యం అందించడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాశ్, అశోక్, చందు, దుంపల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో డబ్ల్యూటీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 59వ వార్షిక క్రీడోత్సవంలో భాగంగా గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మందమర్రి ఎంవీటీసీ మేనేజర్ శంకర్ ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో కేకే అండ్ ఎస్‌కే గ్రూప్ జట్లు గెలుపొందగా, కాసిపేట 1 అండ్ 2రన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, కో ఆర్డినేటర్స్ రవికుమార్, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి తదితరులు ఉన్నారు.

పదోన్నతి పొందిన డీఎంహెచ్‌వోకు సన్మానం


సన్మానిస్తున్న పారామెడికల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉంటూ మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జిగా బాధ్యతలను స్వీకరిస్తున్న డాక్టర్ జి.సి.సుబ్రరాయుడు సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది, పూర్తిస్థాయి జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు పొందిన ఆయన్ను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా పారామెడికల్ ఐక్య కార్యచరణ కమిటీ(జేఏసీ) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పారా మెడికల్ అన్ని క్యాడర్ల తరుపున అన్ని సంఘాల పక్షాన ప్రతినిధులు తొగరు ప్రభాకర్, అల్లాడి శ్రీనివాస్, గుండేటి నాందేవ్, జగదీశ్, శంకర్, వెంకటేశ్వర్లు, శివకుమార్, మెడికల్ జేఏసీ ప్రతినిధులు డాక్టర్ ఫయాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి కనబడట్లేదా?


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నా, అవి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు ఎందుకు కనిపించడం లేదో అర్థం కావడం లేదని, ఇలాంటి మాటలను ప్రజలు నమ్మరని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షపూరితంగానే మున్సిపల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉండే 9వార్డుల్లో ఇప్పటి వరకు రూ.15.63కోట్ల రూపాయలను అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. అనవసరంగా ఆరోపణలు చేస్తూ, ప్రజల్లో చులకన కావద్దని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, వార్డు కౌన్సిలర్లు, డీసీసీబీ డైరెక్టర్ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు సరోజ, నాయకులు పాల్గొన్నారు.

రాణి దుర్గావతి జయంతి

చెన్నూర్: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో రాణి దుర్గావతి జయంతి వేడుకలను ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీరనారి రాణి దుర్గావతిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సబ్‌జైల్‌లో వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్‌జైల్‌లో అండర్ ట్రయల్ ఖైదీలకు ఐసీటీసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవీ, ఇతర వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. జాగ్రత్తగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, ఆంజనేయులు, రమేష్, రాజేశ్వర్, జైలర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

యాపల్ ఏరియాలో...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని యాపల్ ఏరియాలో వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైరల్ ఫీవర్స్, దగ్గు, మధుమేహం, రక్తపోటు, తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అందుబాటులో ఉన్న మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గంగాధర్, సిబ్బంది అనిత, జ్యోతి, ఏఎస్ఎంలు ఉన్నారు.

ఈ నెల 15న వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న తలసేమియా, సికిల్‌సెల్, సికిల్‌తాల్ వ్యాధిగ్రస్తులకు హైదరాబాద్‌కు చెందిన అమెరికన్ ఆంకాలజీ ఆసుపత్రి వైద్యుడు బోన్ మారో స్పెషలిస్టు, హిమటాలజిస్టు డాక్టర్ సి.ఎస్.రంజిత్ కుమార్‌చే 15వ తేదీన వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కానర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు శ్రీనివాస్ 9849643083 నంబరులో సంప్రదించాలని కోరారు.

డివిజన్ ఏర్పాటుపై సంబురాలు

చెన్నూర్: రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు జరిపారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రావణ్, ప్రశాంత్, పున్నం, శ్రీధర్, మల్లేశ్, నాగరాజు, పోచం, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జిల్లా సమావేశం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నేడు (శుక్రవారం) ఉదయం 11గంటలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో హాజరుకావాలని కోరారు.

'నాణ్యతగా లేవనడం సరికాదు'

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడడుచులకు బతుకమ్మ కానుకగా ఇచ్చే చీరలు నాణ్యతగా లేవని, దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. దండేపల్లిలో బుధవారం చీరల పంపిణీలో ఎంపీపీ మాట్లాడిన మాటలను ఖండిస్తూ, గురువారం దండేపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీపీగా ఎన్నికైన శ్రీనివాస్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగానే, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు బాగాలేవని అనడం పద్ధతిగా లేదన్నారు. సమావేశంలో రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఆలంపూర్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్లను తిలక్ స్టేడియంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఆవిష్కరించారు. విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సంగర్స్ రాజేశ్వర్‌రావు, ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నాడు. దీంతో ఇదే పాఠశాలలో చదివిన 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రాజేశ్వర్‌రావును గురువారం శాలువాతో సత్కరించారు.

'అధికారులపై ఆరోపణలు సరికావు'

జన్నారం: ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెల పంపిణీలో జాప్యానికి అధికారులే కారణమని, ఆరోపణలు చేయడం సరికాదని యాదవ సంఘం నాయకులు గట్టు మహేశ్, నరేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. కొందరు యాదవ సంఘానికి చెందిన వారు గొర్రెల పంపిణీలో అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపించడం సరికాదన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో సంబురాలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థిని నందిని ఏషియన్ గేమ్స్‌లో హెప్టాథ్లన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు.

బీహార్ సీఎం నితీష్‌కుమార్‌కు క్షీరాభిషేకం

పాతమంచిర్యాల: బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బీసీ కులగణన చేపట్టిన సందర్భంగా బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు నితీష్ కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సంజయ్ అరెస్టుపై నిరసన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆమ్‌ఆద్మీ పార్టీ సంజయ్ సింగ్ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

ముస్లిం డిక్లరేషన్ సభ పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి తాపీ కార్మిక సంఘం భవన్‌లో ఈ నెల 7న ముస్లిం డిక్లరేషన్ సభ జరుగుతుందని రాష్ట్ర ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్‌యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. తిలక్‌స్టేడియం ఆవరణలో సభ పోస్టర్ ఆవిష్కరించారు.

తాండూర్: సభ విజయవంతం చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాష్ట్ర ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడు ఎం.డీ సాబీర్ హుస్సేన్ అన్నారు. తాండూర్ మండలం ఐబీ ప్రాంతంలో డిక్లరేషన్ సభ పోస్టర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

ఆర్‌కే ఓసీలో స్వచ్ఛతా హి సేవా


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉద్యోగులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో గురువారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఓసీలో చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లు, సేఫ్టీ ఆఫీసర్ రామరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'సమన్వయంతో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెద్దాం'

జన్నారం: ఎన్నికలు సమీపిస్తున్నందునా గ్రూపులకు తావివ్వకుండా సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొద్దామని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అందిస్తున్న తీరు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గురించి గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు వచ్చే మార్చి నెలలో చెల్లించే పన్నును ముందస్తుగానే చెల్లించి, వడ్డీ భారం పడకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు మీ ఇంటికి వచ్చే బిల్ కలెక్టర్లకు సకాలంలో బిల్లులను చెల్లించాలని, బిల్‌కలెక్టర్లు లేదా, మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో గాని పన్ను చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇంజినీర్ల నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన ప్రొఫెషనల్ ఇంజినీర్స్, ఆర్కిటెక్చర్స్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో తూర్పు జిల్లా ప్రొఫెషనల్స్ ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్చర్ల నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం సాయంత్రం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా నందమయ్య, అధ్యక్షుడిగా వద్దూరి శ్రీనివాస రాజు, ప్రధాన కార్యదర్శులుగా సాదుల ప్రవీణ్‌కుమార్, సీత జగన్, కోశాధికారిగా మోటూరి వినిత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పూర్ణ చందర్, బసలత్ ఆలీఖాన్, చేతన్‌బంగ్, జాయింట్ సెక్రటరీలుగా వెల్పుల పవన్‌కుమార్, వంశీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండీ సమీర్, సంస్కృతిక కార్యదర్శిగా గోపికృష్ణ, సంఘం ప్రతినిధిగా రాజ్ యాదవ్‌ను నియమించారు. ఈ ఎన్నిక రెండు సంవత్సరాలు కొనసాగుతుందని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఘనంగా కాకా జయంతి

బెల్లంపల్లి/వేమనపల్లి: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతిని గురువారం బెల్లంపల్లి, వేమనపల్లిలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అన్నదాన కార్యక్రమాలు చేశారు. వేమనపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్, వేమనపల్లిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణ, బీజేపీ ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, ఉపాధ్యక్షుడు ఏట మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

జైపూర్/రామకృష్ణాపూర్: మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతిని రామకృష్ణాపూర్, జైపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాకా చిత్రపటానికి నివాళులర్పించారు. వేలాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రసాద్, బాలాజీ, తిరుపతి, జైపూర్‌లో బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల భిక్షాటన

నెన్నెల: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనం, పెండింగ్ బిల్లులను కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని వారం రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు వాడవాడల్లో ర్యాలీగా వెళ్లి చీర కొంగులను చాచి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు ప్రకటించారు.